క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై మండలంలోని సూర్యనారాయణపురం వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో మండల కేంద్రమైన కోరుకొండకు చెందిన పంపన విష్ణుతేజ (24) అనే యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సంక్రాంతి సందర్భంగా విష్ణుతేజ నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలోని తన మేనమామ తంగెళ్ల రాంబాబు ఇంటికి వచ్చాడు. సోమవారం తిరిగి స్వగ్రామం కోరుకొండ వెళుతుండగా సూర్యనారాయణపురం వద్ద అతడు నడుపుతున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన విష్ణుతేజను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కృష్ణంపాలెం వద్ద మరో యువకుడు..


మృతుడు జాలిమి వంశీకృష్ణ

జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణంపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో గోపాలపురం మండలం దొండపూడికి చెందిన జాలిమి వంశీకృష్ణ (25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వంశీకృష్ణ తన బంధువులతో కలిసి దేవరపల్లి మండలం యర్నగూడెంలోని తన భార్య వద్దకు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. రాత్రి 11 గంటల సమయంలో కృష్ణంపాలెం వద్దకు వచ్చే సరికి అతడి బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే గల డివైడర్‌ను ఢీ కొట్టింది. తలకు బలమైన గాయమైన వంశీకృష్ణను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. మృతుడి తండ్రి విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పందేలు ఆడుతున్న 12 మందిపై కేసుల నమోదు

తాళ్లపూడి: సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడి పందేలు, గుండాట నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు. మూడు రోజులుగా 12 మందిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. అనుమతి లేకుండా గుండాట, కోడి పందేలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

శాస్త్రోక్తంగా గోపూజ

కడియం: స్థానిక భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని గోశాలలో మంగళవారం శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా ఆలయ అర్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో గోసంరక్షణ సేవా సమితి అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దొడ్డ బుజ్జి, పిండి నాగరాజు, చిక్కాల శ్రీను, మండపల్లి త్రిమూర్తులు, బండారు భాస్కరరావు పాల్గొన్నారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు

నిడదవోలు రూరల్: సంక్రాంతి సందర్భంగా మండలంలోని గ్రామాలు మూడు రోజుల పాటు సందడిగా మారాయి. ఇంటింటా సంక్రాంతి పండుగతో పల్లెలు కళకళలాడాయి. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో గ్రామాలు సందడిని సంతరించుకున్నాయి. పిండి వంటలు, రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. మండలంలోని రావిమెట్ల గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు సర్పంచ్ కాల్దారి సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఉప్పులూరి తేజశ్రీ , వైఎస్సార్ సీపీ నాయకుడు రామకృష్ణలు బహుమతులు అందజేశారు. పెండ్యాల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామ రామాలయం వద్ద ముగ్గులు పోటీలు నిర్వహించి తొలి మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేశారు. సమిశ్రగూడెం గరువువీధిలోని సోమాలమ్మ వారి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కోరుమామిడి, పురుషోత్తపల్లి గ్రామాల్లో కనుమ రోజు చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. పలు గ్రామాల్లో యువత ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కనుమ పండుగను పురస్కరించుకుని రైతులు తమ పశువులను శుభ్రంగా కడిగి పూలదండలతో అలంకరించారు.


నిడదవోలు మండలం పెండ్యాల గ్రామంలో ముగ్గుల పోటీల సందడి

గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దేవంలో ముగ్గుల పోటీలు

తాళ్లపూడి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పెద్దేవం గ్రామంలోని వాటర్ ట్యాంక్ మైదానం వద్ద మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనసేన పార్టీ పెద్దేవం గ్రామ శాఖ అధ్యక్షుడు నామన చినబుర్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజయభాస్కర్, పసలపూడి వెంకటలక్ష్మి, నవ్య, సంకాబత్తుల వెంకటలక్ష్మి, సిద్ధ రామకృష్ణ, సుంకర సత్తిబాబు, లిఖిత పాల్గొన్నారు.

చాగల్లు: సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముంగిట ముగ్గులు వేసి పిండి వంటలు చేసే పనుల్లో రద్దీగా గడిపారు. కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులతో ప్రతి ఇల్లూ కళకళలాడింది. కోడి పందేలపై ప్రజలు ఆసక్తి చూపించారు. మీనానగరం, ఊనగట్ల, చిక్కాల శివారు, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, నందిగంపాడు గ్రామాల్లో పోటీలు జోరుగా సాగాయి. పందేల్లో లక్షలాది రూపాయిలు చేతులు మారాయి. ఆఖరి రోజు కనుమ పండుగ రోజున గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. బ్రాహ్మణగూడెం నాగారమ్మ, చిక్కాల, చాగల్లులో పాటెమ్మకు ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు.


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ప్రత్యేక పుష్పాలంకరణలో సోమాలమ్మ వారు

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు


కె.సావరంలో ముత్యాలమ్మ గరగల ఊరేగింపు

ఉండ్రాజవరం: మండలంలో వడ్లూరు గ్రామ దేవత గోగులమ్మ జాతర మంగళవారం రాత్రి, కె.సావరం గ్రామంలో ముత్యాలమ్మ జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగలతో ఆసాదుల నృత్యాలు, వివిధ వేషధారణలు, అమ్మవారి సేవ(ఉరేగింపు) కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకోవడంతో రెండు గ్రామాల్లో సందడి నెలకొంది. బంధువులు, స్నేహితులు, ఆడపడుచులతో గ్రామంలో ఇళ్లన్నీ సంక్రాంతి పండుగ, జాతరలతో కిటకిటలాడాయి.

అత్తమామలకు అల్లుళ్ల విందు

- 50 రకాల స్వీట్లు, హాట్లు, మరో 50 రకాల పండ్లతో..

నల్లజర్ల: సంక్రాంతి పండుగకు ఇంటికొచ్చే అల్లుళ్లకు రకరకాల వంటకాలు వడ్డించి, గౌరవ మర్యాదలు చేయడం మన ప్రాంత సంప్రదాయం. అందుకు భిన్నంగా ఆ ఇద్దరు తోడల్లుళ్లు ఈ సంక్రాంతి నాడు అత్తవారింటికొచ్చి, అత్తవారి కుటుంబానికే వంద రకాల పండ్లు, పిండి వంటలతో విందు ఏర్పాటు చేయడం విశేషం. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పోతవరానికి చెందిన మోత్కూరి శ్రీనివాస్, పద్మజ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలకు ఇప్పటికే వివాహాలు చేశారు. కనుమ పండుగ సందర్భంగా మంగళవారం ఆ ఇంటి పెద్దల్లుడు దిప్పకాయలపాడుకు చెందిన బొమ్మా సుబ్రహ్మణ్యం, ఆయన భార్య సాయిప్రసన్న (శ్రీనివాస్, పద్మజ దంపతుల పెద్దకుమార్తె) , పెదనింద్రకొలనుకు చెందిన చిన్నల్లుడు పద్మనాభుని సూర్యకిరణ్, ఆయన భార్య సుష్మ (శ్రీనివాస్, పద్మజ దంపతుల చిన్న కుమార్తె) అత్తవారింటి కొచ్చారు. తోడల్లుళ్లు, అక్క చెల్లెళ్లు ఖాళీ చేతులతో రాలేదు.


ఒకే పంక్తిలో కూర్చుని భోజనాలు చేస్తున్న శ్రీనివాస్ కుటుంబీకులు

స్వీట్లు, పిండి వంటలు, వివిధ రకాల పండ్లు తీసుకు వచ్చారు వారే భోజనాలు స్వయంగా వండి అత్తగారి కుటుంబానికి వడ్డించారు. స్వీట్లు, హాట్‌లు 50 రకాలు కాగా, మరో 50 రకాల పండ్లు తీసుకువచ్చారు. వాటన్నింటిని 25 అరటి ఆకులలో పేర్చి దాదాపు 100 మంది కుటుంబ సభ్యులు ఒకేసారి విందు ఆరగించారు. ఉమ్మడి కుటుంబం గొప్పదనాన్ని, ఐక్యంగా ఉండడంలో కలిగే ఆనందాన్ని పెద్దలకు పిల్లలకు తెలియజెప్పారు. ఆట విడుపుగా ముగ్గులు, చిత్రలేఖనం, హౌసీ పోటీలు నిర్వహించారు.

శర వేగంగా శ్రీవారి ఆలయం

- యర్నగూడెంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ప్రధాన దాతలు కాశీవిశ్వనాథం దంపతులు


యర్నగూడెంలో నిర్మాణంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం

దేవరపల్లి: యర్నగూడెం వద్ద అలివేలు మంగ, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఆ గ్రామస్తుల సహకారంతో పారిశ్రామిక వేత్త శ్రీకాకోళపు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులు ఫిబ్రవరి 21న ఈ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. సుమారు రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో వారీ ఆలయ నిర్మాణం చేపట్టారు. నిడదవోలు-పొంగుటూరు ప్రధాన రోడ్డును ఆనుకుని ఆలయాన్ని నిర్మిస్తున్నారు. పనులు దాదాపు పూర్తికావడంతో ఫిబ్రవరి నెలాఖరున అమ్మవార్ల, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సన్నాహాలు చేస్తున్నారు. అమ్మవార్ల, స్వామి వారి విగ్రహాలతో పాటు గరుత్మంతుడు, ద్వారపాలకుల విగ్రహాలను ఇప్పటికే కాంచీపురం నుంచి తీసుకు వచ్చి ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉంచారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఆలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడా ఐరన్ వాడకుండా రాతి కట్టడాలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు.

దేవరపల్లి ఆలయానికి మకర తోరణం

కాగా దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవార్లకు రూ.10 లక్షల వ్యయంతో 11 కిలోల వెండితో రెండు మకర తోరణాలు చేయించి అందజేసినట్టు యర్నగూడెం ఆలయ ప్రధాన దాత కాశీవిశ్వనాథం తెలిపారు. దేవరపల్లి-గోపాలపురం రోడ్డులో తన కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులకు రూ.35 లక్షలతో తన తల్లిదండ్రులు శ్రీకాకోళపు లక్ష్మీనరసింహారావు, సుశీల పేరున బస్‌షెల్టర్ నిర్మించారు. దేవరపల్లిలో వృద్ధాశ్రమాన్ని నిర్మించాలనే యోచన ఉందని ఆయన చెప్పారు. శ్రీలక్ష్మీనరసింహ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యర్నగూడెం ఆలయంలో నిత్యపూజలు, దీపధూప నైవేద్యాలకు ఇబ్బంది కలగకుండా దాతల సహకారంతో శాశ్వత నిధి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అనంతపల్లి హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూల్ 1979-80 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం మంగళవారం ఆ పాఠశాలలో జరిగింది. దాదాపు 43 ఏళ్ల తర్వాత కలుసుకున్న పాత మిత్రులందరూ గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. ఆనాడు ఒకే స్కూల్లో చదువుకున్న వీరంతా ఇపుడు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ రిటైర్‌మెంట్‌కు దగ్గర్లో ఉన్నారు. వచ్చే వేసవిలో మరోసారి పూర్తి స్థాయిలో సభ్యులు సమావేశం కావడానికి అప్పటి విద్యార్థులందర్నీ ఆహ్వానించడానికి ఆహ్వాన కమిటీని నియమించారు. తమతో పాటు చదివి మృతి చెందిన విజయకుమారి, ప్రసాద్, అప్పారావులకు సమావేశం సంతాపం తెలిపింది. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందివ్వాలని వారంతా తీర్మానించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని రామదాసుపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పిడింగొయ్యి గ్రామానికి చెందిన దొండపాటి అర్జున్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

- రాజమహేంద్రవరం లలితా నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బడుగు సతీష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అశ్వ వాహనంపై వేంకటేశ్వరస్వామి వారు


అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారికి హారతి ఇస్తున్న పురోహితుడు


అన్నవరప్పాడులో , అశ్వవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. సోవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగ కావడంతో ఆలయం అంతా 'నమో.. వేంకటేశ ' అనే నామస్మరణతో మారుమోగింది. సోమవారం గజ వాహనంపై, మంగళవారం అశ్వవాహనంపై స్వామి వారు గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగారు. బ్యాండుమేళాలు, భాజాభజంత్రీలతో స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సందడిగా సాగింది. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కత్తులు దూసిన పందెం కోళ్లు


పెరవలి మండలం ఖండవల్లిలో పోటీకి పుంజులను సిద్ధం చేస్తున్న పందేల నిర్వాహకులు


పెద్దేవంలో బరిలో తలపడుతున్న పందెం కోళ్లు


జాతరను తలపిస్తున్న నిడదవోలులోని యర్నగూడెం రోడ్డులోని కోడిపందేల బరి

- పలు ప్రాంతాల్లో జోరుగా పందేలు
- యథేచ్ఛగా గుండాట
- జాతరలను తలపించిన బరులు
- వీక్షించేందుకు ఇతర ప్రాంతాల నుంచి జనం రాక

దేవరపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని డెల్టా ప్రాంతానికి ధీటుగా మెట్ట ప్రాంతంలో కోడిపందేలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రంతో గోపాలపురం నియోజకవర్గంలో కోడిపందేలు ముగిశాయి. ఒక్కొక్క పందెం బరి వద్ద 5 నుంచి 10 బోర్డులు ఏర్పాటు చేసి గుండాట నిర్వహించారు. గతంలో పోలిస్తే కోడి పందేల సందడి పెరిగింది. త్యాజంపూడిలో పలువురు మహిళలు కోడిపందేలను తిలకించారు. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, కర్నాటక, ఇతర దేశాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన బంధువులు ఆసక్తిగా పందేలను తిలకించారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు 20 బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ఒక్కొక్క పందెం రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకూ సాగినట్టు సమాచారం. ఈ ఏడాది బరుల సంఖ్య తగ్గింది. బరుల నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో చిన్న బరుల వద్ద మిగులు ఉండడం లేదని పలువురు నిర్వాహకులు తెలిపారు. మండలంలో దేవరపల్లి, బందపురం, త్యాజంపూడి, యర్నగూడెం, సూర్యనారాయణపురం గ్రామాల్లో పందేలు నిర్వహించారు. చిన్నాయగూడెం, యర్నగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో పందేలు జోరుగా జరిగాయి. చిన్నాయగూడెం బరిలో సోమవారం రాత్రి ముసుగు పందాలు నిర్వహించారు. రూ.15 లక్షలకు 15 పందేలు నిర్వహించారు.

గోపాలపురం: మండలంలో ఆది, సోమ మంగళవారాలు భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. మండలంలోని దొండపూడి, కొవ్వూరుపాడు, గుడ్డిగూడెం, జగన్నాథపురం , వాదాలకుంట, వేళ్లచింతలగూడెం, వెంకటాయపాలెం, గోపాలపురం, గంగోలు గ్రామాల్లో కోడిపందేలతో పాటు పేకాట స్థావరాలు కూడా ఏర్పాటు చేశారు. ఒక్కో చోట రూ.లక్ష నుంచి రూ. 3 లక్షల వరకూ పందేలు జరిగాయి. మొత్తం మీద కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కోడి పందేలు నిర్వహించిన ప్రతి చోటా పందెంలో ఓడిన కోడిన (కోజా)ల కోసం జనం ఎగబడ్డారు. ఒక్కొక్క కోజా రేటు రూ.4 వేల నుండి రూ.6 వేల వరకూ పలికింది.

పెరవలి మండలంలో 630 పందేలు

పెరవలి: సంక్రాంతి సందర్భంగా మండల వ్యాప్తంగా నిర్వహించిన కోడిపందేలు, గుండాటల్లో సుమారు రూ.రెండు కోట్ల మేర చేతులు మారాయని అంచనా. కోడిపందేల బరుల వద్ద నిర్వాహకులు వీక్షకుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన కోడి పందేల్లో హైదరాబాద్, నల్గొండ, చిత్తూరు, కడప, కృష్ణా, గుంటూరు, తూర్పు, విశాఖ జిల్లాల నుంచి వచ్చిన వారు కూడా పాల్గొన్నారు. మండలంలోని ఖండవల్లి, పెరవలి, ముక్కామల, అజ్జరం, మల్లేశ్వరం, వెంకట్రాయపురం, పిట్టల వేమవరం గ్రామాల్లో ఈ మూడు రోజుల్లో 630 పందేలు జరిగాయి. గుండాటల వద్ద లక్షలాది రూపాయలు చేతులు మారాయి.

నిడదవోలు: పట్టణంలోని ఎంవీ నగర్ సమీపంలో ఏర్పాటు చేసిన బరిలో భారీగా కోడి పందేలు జరిగాయి.


గోపాలపురం మండలంలో కోడి పందేల కోలాహలం

ఇక్కడ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వీక్షకులకు పందేలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బరిలో తెలంగాణ, కర్నాటక, ఉభయ గోదావరి జిల్లాల నుంచి భారీగా వచ్చిన వారు పెద్ద మొత్తంలో పందేలు కాశారు. స్థానిక యర్నగూడెం రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని లే అవుట్‌లోను, బసివిరెడ్డిపేట, గూడెం రైల్వే గేటు వద్ద వేసిన బరుల్లోనూ పందేలు జోరుగా సాగాయి. కోడి పందేలతో పాటు గుండాట, మూడు ముక్కలాట వంటి జూదాలు సైతం నిర్వహించారు. మహిళలు సైతం పందేలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. పందేల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా రాజమహేంద్రవరం, భీమవరాల నుంచి నిర్వాహకులు బౌన్సర్లను తీసుకు వచ్చి బందోబస్తు నిర్వహించారు. బరుల వద్ద నిర్వాహకులు రుచికరమైన ఆహారంతో పాటు సకల సదుపాయాలు కల్పించారు.

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, సింగవరం, డి.ముప్పవరం, విజ్జేశ్వరం గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. బరులు వద్ద గుండాటతో పాటు నిర్వాహకులు బిర్యానీ సెంటర్లు ఏర్పాటు చేశారు. పందేలకు వచ్చిన వారితో ఆయా గ్రామాలు సందడిగా మారాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వాహనాలపై అక్కడికి చేరుకుని పందేలను వీక్షించారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, పెద్దేవం, గజ్జరం, మలకపల్లి, వేగేశ్వరపురం, రావూరుపాడు తదితర గ్రామాల్లో మంగళవారం మూడో రోజు కూడా జోరుగా కోడిపందేలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, పలువురు ప్రముఖులు కూడా పందేల బరుల వద్దకు రావడంతో అక్కడ జాతర వాతావరణం నెలకొంది. బరుల వద్ద గుండాట కూడా నిర్వహించారు. పందేల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. మలకపల్లిలో భారీగా ఏర్పాట్లు చేశారు. పందేంలో ఓడిపోయిన కోజాలకు డిమాండ్ ఏర్పడింది. ఒక్కొక్కటి రూ.3 వేల నుంచి రూ.6వేల రేటుకు విక్రయించారు.


పెరవలి మండలం ఖండవల్లిలో గుండాట


తాళ్లపూడి మండలంలో గుండాట ఆడుతున్న దృశ్యం


దేవరపల్లిలో కోడిపందేల బరి వద్ద ఏర్పాటు చేసిన గుండాట

వైభవంగా దోసాలమ్మ జాతర

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ సంక్రాంతి జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, గాజులు, చీరలు సమర్పించారు. జాతర నేపథ్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఊయల సేవ నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పంచలోహ విగ్రహం ఉత్సవమూర్తి రూపంలో భారీ ఊరేగింపు, సంబరం మహోత్సవం జరిపారు. ఆలయం నుంచి గరగ నృత్యాలు, వాయిద్యాలతో ఊరేగించారు. ముందుగా గౌరీచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయానికి తీసుకువెళ్లి పూజలు చేశారు. అనంతరం పాత బొమ్మూరు, రాజవోలు రోడ్డు, పంచాయతీ వీధి, బాలాజీపేట జంక్షన్ తదితర వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. బొమ్మూరుకు చెందిన ప్రభు ఫైర్‌వర్క్స్ గుత్తుల శ్రీను ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు నిర్వహించారు.

ఘనంగా చింతాలమ్మ తీర్థం

కడియం: దుళ్ల శివార్లలో కొలువైన చింతాలమ్మ తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కనుమ పండగ రోజు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కడియం, మండపేట, ఆలమూరు మండలాలకు సరిహద్దుల్లో ఉన్న ఈ అమ్మవారిని ఇష్టదైవంగా కొలుస్తారు. ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం నేపథ్యంలో దుళ్ల - మండపేట ప్రధాన రహదారిపై భక్తుల రద్దీ ఏర్పడింది.